# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | ఆదివారం 03 నవంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 145

తెలుగు దినపత్రిక


## సదర్‌తో దద్దరిల్లుతున్న నగరం..



- ప్రత్యేక ఆకర్షణగా దున్న రాజుల విన్యాసం..
- భారీగా తరలివచ్చిన జనం..

4

## అన్నీ అబద్ధాలే..


### హామీల అమలులో రేవంత్ చెప్పేవన్నీ అవాస్తవాలే...



- రాష్ట్రంతో పాటు దేశ ప్రజలను మోసం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం 1.61 లక్షల పోస్టులు భర్తీ చేసింది
- నియామకాలపై తప్పుడు ప్రచారం దురదృష్టకరం
- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు..

4





అంత తేలికేం కాదని మోదీ., మీరు చెప్పొచ్చు కానీ చాలికా.. అని రేవంత్. పీఎం వర్సెస్ సీఎం. మౌనంగా సాగిస్తున్న యుద్ధమిది. రాతలు, మాటల మధ్య సమరమిది. పార్టీ శ్రేణులకు చీఫ్ మల్లికార్జున ఖర్గే ఇచ్చిన సూచన మొత్తం ఎపిసోడ్ కు ఆజ్యమైంది. ఎన్నికల్లో ఆచరణ సాధ్యమైన, ఆర్థికంగా చేయగలిగే హామీలు మాత్రమే ఇవ్వండని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. సొంత పార్టీలోని మహామహుల ముందు ఆ స్థాయి వ్యక్తి మాట్లాడిన ముచ్చట అంత తేలిగ్గా తీసుకునేది కాదని ఇరుగుపొరుగు పార్టీవాళ్లు అనుకోవడంలో తప్పు లేదు., తప్పదు కూడా. సరిగ్గా ఆ విషయాన్ని పట్టుకుని తన ఎక్స్ వాల్ లో ప్రధాని మోదీ 'ఫేక్ ప్రామిసెస్ ఆఫ్ కాంగ్రెస్' అని రాసుకొచ్చారు. అది చూసిన ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకేమోగానీ మనోడికి మాత్రం మండినట్టుంది. వెంటనే తనదైన శైలిలో కౌంటర్ అటాక్ ఇచ్చి సంతృప్తిపర్చుకున్నట్టు అనిపిస్తోంది.

# అంత తేలికా..? ఆపు చాలికా...?!

## ఫేకెవరు... ఫెయిలెవరు...?

- మోదీ ట్వీట్ కు రేవంత్ కౌంటర్..
- ఖర్గే మాటలతో రాచుకున్న కుంపటి..
- పోటాపోటీగా ట్వీట్ల యుద్ధం...
- పదివేల రోజులిచ్చినా సరిపోదు.. : బండి
- సీఎంకు సంజయ్ ఘాటు బదులు..

## పీఎం వర్సెస్ సీఎం

జనపదం, బ్యూరో

హామీలు వర్సెస్ ఆచరణలు., వాగ్దానాలు వర్సెస్ వాయిదాలతో కాలం నెట్టుకు రావడం మధ్య రాజుకున్న సమరమిది. ఎన్నిక ప్రచారం వేళ కుమ్మరించిన వరాలు, ఎడాపెడా ఇచ్చిన వాయి నాలకు ఫలితాల అనంతరం వాటిని తీర్చడానికి మీనమేషాలు లెక్కించే యత్నాలకు మధ్య రగు లుకుంటున్న యుద్ధమిది. కాంగ్రెస్ చీఫ్ నోటి నుంచి వెలువడిన మాటలకు నిగుఢార్థం తీసి రాతలు రాసిన పీఎం కు కౌంటర్ గా సీఎం మళ్లీ తనదైన విధానంతో విరుచుకుపడిన వివరణ... ఇలా మొత్తంగా హామీలు.., అమలు.., సాధ్యాసాధ్యాలపై సాగుతున్న చర్చంతా మీడియాలో రచ్చరచ్చ. ఇప్పటికిప్పుడు బేరీజులేసే పరిస్థితులు లేకపోయినా, కాలగమనంలో అర్థమేంటో తెలియాల్సిందే అనిపించే విషయమిది.

ఎప్పుడూ ఏదో ఓ రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం. ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం. దుమ్మెత్తిపోసుకునే క్రమంలో గోతులు తవ్వుకోవడం., ఒకరి తప్పులను మరొకరు ఏకరువు పెట్టుకోవడం పరిపాటే. అందునా ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ మధ్య అధికారం కోసం తప్పని సమరం. ఈ క్రమంలోనే ప్రతి విషయం ఒక ......(తరువాయి 2లో)



## 10 వేల రోజులిచ్చినా సరిపోవు

- ఆరు గ్యారంటీలు అమలు చేయలేరు
- సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ కౌంటర్



## మెట్రో రెండో దశకు గ్రీన్ సిగ్నల్..

- కొత్తగా 5 మార్గాల్లో హైదరాబాద్ మెట్రో..
- 76.4 కిలోమీటర్ల మేర నిర్మాణానికి చర్యలు
- పరిపాలనా అనుమతులు మంజూరు

3



## కార్తీకం.. ప్రత్యేకం..

- శైవక్షేత్రాలకు స్పెషల్ బస్సులు..
- అరుణాచలం, పంచారామాలకు ప్యాకేజీలు
- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి
- పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష

4




# లోకల్ ఫైట్..?

### సంక్రాంతి తర్వాత స్థానిక పోరు

- మరో నాలుగేళ్లు రేవంతే సీఎం
- ప్రతిపక్షాల ఆరోపణలు టీ కప్పులో తుపాను మాదిరి..
- ఇందిరమ్మ ఇళ్లకు ఆధార్ లింకు
- ఈ నెల 6 నుంచి గ్రామ సభల్లో లబ్ధిదారుల ఎంపిక
- త్వరలోనే రేషన్ కార్డుల స్థానాల్లో స్మార్ట్ కార్డ్
- ఇందిరమ్మ ఇళ్ల పనుల మానిటరింగ్ కు 16 శాఖల ఉద్యోగులు
- నిధుల కోసం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు
- మీడియాతో మంత్రి పొంగులేటి చిట్ చిట్

జనపదం, బ్యూరో :

వచ్చే నెలాఖరు లేదా సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆ లోగా సమగ్ర కుటుంబ సర్వే.. కులగణనను సజావుగా, విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. కులగణన ఆధారంగా స్థానిక పోరులో రిజర్వేషన్లు ఉంటాయని మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో చిట్ చాట్ చేసిన పొంగులేటి పలు అంశాలపై కీలకంగా మాట్లాడారు.

రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోస్తామన్న మంత్రి మొదటి దశలో నాలుగు నుంచి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఈ నెల ఆరో తేది నుంచే ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్న పొంగులేటి..ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రత్యేక యాప్ రూపొందించామని, గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ ప్రమేయం ఉండదని, పేదవారిలో కడుపేదలకు ముందు ఇండ్ల కేటాయింపు ఉంటుందని, ఈనెల 28లోపు మొదటి దశ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారులతోనే ఇల్లు నిర్మింపజేసేలా ప్రణాళికలు సిద్ధం ......(తరువాయి 2లో)

## కుక్కలు కూడా దేఖియ్..




- పాక్కుంటూ వెళ్లినా పట్టించుకోరు..
- కేటీఆర్ ను నమ్మే పరిస్థితులు పోయాయ్..
- రాష్ట్రంలో పాలనను గతి తప్పేలా చేసిందే వాళ్లు..
- స్థానిక ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ రెడీ..
- ప్రత్యామ్నాయం కమలమే..
- నిజామాబాద్ ఎంపీ అరవింద్

4



# సంస్కరించండి..

## ప్రక్షాళన చేయండి..

- విశ్వవిద్యాలయాల బలోపేతం తక్షణ అవసరం..
- దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి
- విద్యా మండలి, వీసీలకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- మండలి చైర్మన్, కొత్త వీసీలతో భేటీ

జనపదం, బ్యూరో :

రాష్ట్రంలోని యూనివర్సిటీలను నూటికి నూరు శాతం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, ఉన్నత విద్యకు సంబంధించి గడిచిన పదేండ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత విద్యా మండలికి, వైస్ చాన్సలర్లకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ తో పాటు అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు సీఎంను శనివారం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యామండలి, వీసీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎవరి ప్రభావితంతోనో వైఎస్ చాన్సలర్ పోస్టులకు ఎంపిక జరగలేదన్న సీఎం మెరిట్, సామాజిక సమీకరణల ఆధారంగానే ఎంపిక జరిగిందన్నారు. బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. కొంతకాలంగా యూనివర్సిటీల పట్ల విశ్వాసం సన్నగిల్లిందని తిరిగి వర్సిటీల గౌరవం పెంచే దిశగా పని చేయాల్సిన బాధ్యత ప్రతి వీసీపై ఉందన్నారు. అందుకోసం విశ్వవిద్యాలయాలకు నూటికి నూరుశాతం ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. గతంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను విద్యార్థులు యేళ్ల తరబడి గుర్తు పెట్టుకునేవాళ్లన్న సీఎం ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి ప్రమాణాలను పెంచే చర్యలు మొదలు పెట్టాలన్నారు. అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు ..(తరువాయి 2లో)



## 6 నుంచి ఒంటిపూట బడులు

- ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే వర్తింపు..
- అయినా.., మధ్యాహ్న భోజనం మాత్రం పెట్టాల్సిందే..
- హైస్కూళ్లకు పనివేళలు యథాతథం..
- అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా కులగణన ప్రారంభం
- రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు..

4

## నిర్దేశిత లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలి

- కోతలు, తాలు ముచ్చట చెప్పొద్దు..
- రైసు మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి
- ధాన్యం నిల్వ చేసేందుకు గోడౌన్లను గుర్తించాలి
- 48 గంటల్లో చెల్లింపు పూర్తి చేయాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## బీసీ గణనను లేవనెత్తిందే నేను..

- కామరెడ్డిలోనే బీసీ డిక్లరేషన్ విడుదల
- దేశంలోనే మొదటిసారి కులగణన
- సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..
- ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్ అలీ

2



## నోరు తెరిస్తే తట్టుకోలేరు..

- జాతకాలన్నీ విప్పాల్సి ఉంటుంది..
- ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- బీఆర్ఎస్ నేతలపై మండిపాటు..

4



## నేటి నుంచి జిల్లాలో పోలీసు యాక్ట్

**ఎస్పీ జానకి షర్మిల**

**జనపదం, నిర్మల్:** నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు నవంబర్ 3 నుంచి నెలాఖరు వరకు పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు చేయొద్దన్నారు. ఆయుధాలు, కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పెలుడు పదార్థాలు వాడకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పబ్లిక్ మీటింగ్, గుమిగూడటం వంటివి నిషేధమని తెలిపారు. లౌడ్ స్పీకర్లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో వాడరాదన్నారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు.

## కాంగ్రెస్ కులగణన సమావేశంలో లొల్లి

**ఆసిఫాబాద్‌లో ఉద్రిక్తత**

**విశ్వ ప్రసాద్, శ్యాంనాయక్ వర్గీయుల మధ్య ఘర్షణ**


**జనపదం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ జిల్లాలోని ఓ గార్డెన్ లో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కులగణన కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్చార్జి శ్యాంనాయక్ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఒక్కరి పై ఒక్కరూ కుర్చీలు విసురుకున్నారు. గార్డెన్ లో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు కల్పించుకొని శ్యాం వర్గీయులను సమావేశం నుంచి బయటకు పంపించారు. దీంతో రోడ్డు పై బైఠాయించి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ కు వ్యతిరేకం నినాదాలు చేస్తూ రాస్తారోకో చేపట్టారు.

## సంస్కరించండి..

**(మొదటిపేజీ తరువాయి)** చేసుకొని నివేదిక తయారు చేసుకోవాలని అలాగే వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలన్నారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ ఉంటుందని అలాంటి వారికి ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. ఎవరైనా వీసీలు, సిబ్బంది తప్పు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తు పెట్టుకుని పని చేయాలన్నారు. యూనివర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపైన దృష్టి సారించడంతో పాటు వాటికి బానిసగా మారిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. బాలకృష్ణా రెడ్డి, కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేశ్, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, కొత్తగా నియమితులైన వైస్ చాన్సలర్లు ప్రొ.ఎం.కుమార్ (ఉస్మానియా), ప్రతాప రెడ్డి (కాకతీయ), జీఎన్ శ్రీనివాస్ (పాలమూరు), నిత్యానంద రావు (తెలుగు), అల్తాఫ్ హుస్సేన్ (మహాత్మాగాంధీ), యాదగిరి రావు (తెలంగాణ), అల్దాస్ జానయ్య (జయశంకర్ వ్యవసాయ), రాజిరెడ్డి (కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన వర్సిటీ), ఉమేష్ కుమార్ (శాతవాహన), సూర్య ధనుంజయ (మహిళా వర్సిటీ), గోవర్దన్ (బాసర ఐఐఐటీ) ఉన్నారు.

## స్మగ్లర్లకు సహకరించిన పోలీసుల సస్పెన్షన్

**జనపదం, పటాన్ చెరు:** గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నాయని ఇద్దరు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లను మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ సస్పెండ్ చేశారు. పటాన్ చెరు పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అంబార్యా నాయక్ తో పాటు వీరితో ఉన్న ఎస్సై వినయ్ కుమార్, సీసీ ఎస్ లో హెడ్ కానిస్టేబుల్ మారుతి నాయక్, ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ మధు ప్లాను సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మే నెలలో మనూరు మండలం సనత్పూర్ లో ఓ వాహనాన్ని అడ్డుకొని 120 కిలోల గంజాయిని తమ వాహనంలోకి తీసుకొని ఆ వాహనం సహా నేరస్తులను వదిలేశారు. ఏడు నెలల క్రితం గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్ వర్ని దగ్గర అడ్డుకొని అక్కడినుంచి వారిని పోలీస్ స్టేషన్ తీసుకొని వచ్చి 400 ప్యాకెట్ల గంజాయి తీసుకొని వాహనంతో సహా నేరస్తుని వదిలేశారు.



## 10 కిలోల ఎండు గంజాయి పట్టివేత

**జనపదం, కేసముద్రం :** ఒడిశా నుంచి అహ్మదాబాద్ కు 10 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కిషంత్ నాయక్ నవ జీవన్ ఎక్స్ప్రెస్ రైలులో అహ్మదాబాద్ కు గంజాయి తరలిస్తుండగా పోలీసు తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకున్న నిందితులు మహబూబాబాద్ లో దిగి రోడ్డు మార్గంలో వరంగల్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు కేసముద్రం మండల కేంద్రంలోని ఉప్పర పల్లి రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తుండగా కిషంత్ నాయక్ పారిపోయే ప్రయత్నం చేశాడని, వెంటనే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 10 కేజీల రెండు గంజాయి లభించిందని చెప్పారు. గంజాయి విలువ బహిరంగ మార్కెట్ లో రూ.2.5 లక్షల ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజ్ తో పాటు సిబ్బందిని ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ అభినందించారు.

# నిర్దేశిత లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలి

- కోతలు, తాలు ముచ్చట చెప్పొద్దు..
- మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి
- ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించాలి
- 48 గంటల్లో చెల్లింపు పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్:** జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోలు పై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ చాలా ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న సమస్య కూడా రాకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను విడి విడిగా భద్రపరచాలని సూచించారు. తాలు పేరుతో కోతలు పెట్టొద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని అన్నారు. రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని దాని వల్ల కొనుగోలు ప్రక్రియ సులభం అవుతుందని మంత్రి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీఓపై చర్చించాలని అవగాహన, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేరకు ఇంటర్మీడియట్ గోడౌన్లు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రతీ జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా సరిహద్దు వద్ద పటిష్ఠ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# బీసీ గణనను లేవనెత్తిందే నేను..

- కామారెడ్డిలోనే బీసీ డిక్లరేషన్ విడుదల
- దేశంలోనే మొదటిసారి కులగణన
- సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..
- ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్ అలీ



**జనపదం, బ్యూరో:** మండలి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు బీసీ కులగణన అంశాన్ని లేవనెత్తానని, కురుమలు గొర్రెలే కాయాల, కుమ్మరులు కుండలే చేయాలి, ఇలా ఏ వృత్తి వారు ఆ పని చేయాలని చెప్పానని, కానీ స్పీకర్ నా మాటలను రికార్డు నుంచి తొలగించారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గత ఎన్నికల ప్రచారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ద్వారా కామారెడ్డి లోనే బీసీ డిక్లరేషన్ విడుదల చేసిందని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ ప్రోద్బలంతో దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 6వ తేదీ నుంచి జరగనున్న సమగ్ర కుల గణనలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని షబ్బీర్ అలీ కోరారు. భవిష్యత్ లో అన్ని పథకాలకు ఈసర్వే ఆధారంగానే ఉంటాయని చెప్పారు. జిల్లాల్లో ఇప్పటికే ఇళ్ల గుర్తింపు పూర్తి చేశారని, 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రజలంతా విశ్వసనీయ సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే వివరాల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయనుందని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా ఇంటింటి సర్వేను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే కోసం చేస్తున్న ముందస్తు సన్నాహాలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించాలని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సరైన వివరాలు తీసుకోవాలని కుటుంబ సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, కుల సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సర్వే రిపోర్ట్ ఆధారంగానే రాబోయే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. ఇందులో అన్ని కుల సంఘాలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మణప్పురం చోరీ కేసులో కీలక నిందితుడి అరెస్ట్

**వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నారాయణ రెడ్డి**




**జనపదం, వికారాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వికారాబాద్ పట్టణంలో మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ లో జరిగిన దొంగతనం కేసులో కీలక నిందితుడు విశాల్ ను కర్ణాటక రాష్ట్రంలోని ఔరద్ తాలూకా నారాయణపూర్ గ్రామంలో అరెస్ట్ చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ కే నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 19న వికారాబాద్ పోలీస్ స్టేషన్‌కు మణప్పురం రీజినల్ మేనేజర్ రవీంద్ర కుమార్ ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ లో తన టీం సభ్యులతో కలిసి అక్టోబర్ 16న అడిట్ చేయగా ఒక బంగారం ప్యాకెట్ తక్కువ వచ్చినట్లు గుర్తించినట్లు ఫిర్యాదులు పేర్కొన్నారు. 17.10.2024 వికారాబాద్ బ్రాంచ్ కి రాగా వికారాబాద్ బ్రాంచ్ లో మేనేజర్ విశాల్ లేకపోవడంతో అతడికి ఫోన్ చేయగా విశాల్ ఫోన్ లేపకపోవడంతో అనుమానం వచ్చి స్ట్రాంగ్ రూమ్ తెరచి ఆడిటర్ , ఇతర సభ్యులతో కలిసి అడిట్ నిర్వహించగా మొత్తం 63 బంగారం నగల ప్యాకెట్లు కనిపించలేదు. వీటి మొత్తం బరువు సుమారు 2944.226 గ్రాములు, సుమారు వాటి విలువ రూ .2,10,80,290 ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ విశాల్ తన కంపెనీకి నమ్మక ద్రోహం చేసి, మోసపూరితంగా బంగారు నగలు చోరీ చేశాడు. అతనికి వికారాబాద్ మణప్పురం ఉద్యోగులు జూనియర్ అసిస్టెంట్లు శివప్రసాద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆడిటర్ రాజకుమార్ సహకరించారని ఫిర్యాదు రాగా వికారాబాద్ ఎస్పీ ఆదేశాల మేరకు వెంటనే వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ బలవంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి డీఎస్పీ ముందు హాజరుపర్చారు.

# రిజిస్ట్రేషన్ల బంద్ మూర్ఖపు చర్య

- ఇండ్లు కూల్చారు.. ప్లాట్లు కూడా లాక్కుంటారా..?
- హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టింది చాలాదా..?
- కాంగ్రెస్ ప్రభుత్వం సమయంలోనే జీపీ లే అవుట్లు వందలాదిగా వెలిశాయి
- అప్పుడు అనుమతించి ఇప్పుడు కాదంటే కొన్న వాళ్లు ఏమవ్వాలి..?
- రేవంత్ తీరుపై ధ్వజమెత్తిన కేటీఆర్



**జనపదం, హైదరాబాద్ సిటీ:** హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయితీ (జీపీ) లే అవుట్లలో వెలిసిన వెంచర్లలో రిజిస్ట్రేషన్లు బంద్ అని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం నిజంగా మూర్ఖపు చర్యలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఏమాత్రం పేదలు, మధ్య తరగతి ప్రజల గురించి ఆలోచించకుండా ఇలాంటి పిచ్చి నిర్ణయాలు తీసుకోవటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. పరిపాలన అనుభవం లేకుండా తుగ్లక్ ను తలపించేలా రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. మొన్నటి వరకు హైడ్రా, మూసీ పేరుతో పేదల గూడు కూల్చేసిన రేవంత్ రెడ్డి...ఇప్పుడు తాజాగా హెచ్ఎండీ పరిధిలో వరకు ఉన్న పేదలు, మధ్య తరగతిని టార్గెట్ చేశారన్నారు. వాళ్ల ఇళ్లు కూల్చేసిందని చాలదన్నట్లుగా ఇప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజల ప్లాట్లు పై కూడా ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసే కుట్ర జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజల తప్పా..?

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న జీపీ లే అవుట్లలో వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుక్కోవటం ప్రజల తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇదే మాట చెప్పి ఎల్ ఆర్ ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని కేటీఆర్ గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆ ప్లాట్లు ఎంతో మంది చేతులు మారాయని...ఇప్పుడు ప్రభుత్వం వచ్చి ఆ రిజిస్ట్రేషన్లు చెల్లవు, ఇక మళ్లీ రిజిస్ట్రేషన్ చేయమంటే వాళ్ల పరిస్థితి ఏమవుతుందని కేటీఆర్ నిలదీశారు. ప్రభుత్వమంటే ఏళ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. ఎన్నో ఏళ్లుగా లేని వాటిని ఇప్పుడు సమస్యలుగా సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి చేస్తున్న తుగ్లక్ పనులకు ప్రజలే సమిధలవుతున్నారని శనివార విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### చెల్లవనడం భావ్యం కాదు..

భవిష్యత్ కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసా, పైసా కూడబెట్టుకొని పేదలు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇప్పుడు చెల్లవంటే వారి పరిస్థితి ఏం కావాలో చెప్పాలన్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితం తమ తాతాలు, తండ్రులు కొన్న ప్లాట్లను ఇప్పుడు చెల్లవన్నట్లుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే వాళ్లు ఎవరికీ చెప్పుకోవాలని కేటీఆర్ ప్రశ్నించారు.

### బెదిరించి వసూళ్లా..?

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే బిల్డర్లను బెదిరిస్తూ ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తోందని, ఇప్పుడు వెంచర్ల యాజమానుల నుంచి కూడా ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసేందుకే పిచ్చి నిర్ణయాలు తీసుకుంటారని కేటీఆర్ మండిపడ్డారు. ఆర్ ఆర్ ట్యాక్స్ వసూళ్ల పేరుతో పేదలు, మధ్య తరగతి ప్రజలను రేవంత్ రెడ్డి దోచుకుంటున్నాడని కేటీఆర్ అన్నారు. జీపీ లే అవుట్లలో గతంలో కొనుగోలు చేసిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు బంద్ చేయటమంటే పేద, మధ్య తరగతి ప్రజల ఆస్తులను ప్రభుత్వం లాక్కోవటమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇదే మాట ఎల్.ఆర్.ఎస్ విషయంలో మాట్లాడిన సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పుడు నేరుగా ప్రజలు కొనుక్కున్న ఆస్తులు చెల్లవని చెప్పడం వారి మోసపూరిత వైఖరికి నిదర్శనం అన్నారు. ఎన్నికల నాటి హామీ ప్రకారం పూర్తిగా ఎల్ఆర్ఎస్ ఫీజు ను రద్దు చేసిన గ్రామ పంచాయితీ లే అవుట్ల వెంచర్లలోనూ రిజిస్ట్రేషన్లకు అనుమతివ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే బాధిత ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## మెదక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**ఒకే కుటుంబంలో నలుగురు మృతి**

**స్పాట్ వాయిస్, క్రైం:** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన మనోహరాబాద్ మండల పరిధిలోని పోతారంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతారం గ్రామానికి చెందిన మన్నె కుమార్ భార్య లావణ్య (35) తన ఇద్దరు పిల్లలు సహస్ర (10), శాన్వి (6)లతో కలిసి బావ మన్నె ఆంజనేయులు (50)తో ద్విచక్ర వాహనంపై శభాష్‌పల్లి వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో గ్రామ శివారులోని ప్రాణ ఫుడ్స్ పరిశ్రమ వద్ద రోడ్డుపై ధాన్యం కుప్పలు ఎదురుగా ఉండడంతో వాటిని తప్పించబోయారు. అయితే, ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను వేగంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి కారణం రహదారిపై వడ్ల కుప్పలు పోయడమే కారణమని పేర్కొంటున్నారు. ఒక వైపు వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురిని బలి తీసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## లోకల్ ఫైట్..?

**(మొదటిపేజీ తరువాయి)** చేసినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిధుల కోసం ప్రభుత్వం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేస్తుందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్న మంత్రి కేంద్రం పెట్టె అన్ని షరతులకు ఒప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అలాగే గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లను సైతం తాము పూర్తి చేస్తామన్న పొంగులేటి.. ఇందిరమ్మ ఇండ్ల పథకమే కాంగ్రెస్ ను మ రోసారి అధికారంలోకి తీసుకువస్తుందని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో తలెత్తే అడ్డంకులు, అవాంతరాలు, నిధుల సమస్యను అధిగమిస్తూ ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. నాలుగు దఫాలుగా ఇండ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. మొదటి విడతలో రూ. 1లక్ష, రెండవ విడతలో రూ. 1.25 లక్షలు, మూడవ విడతలో రూ. 1.75 లక్షలు, నాలుగవ విడతలో రూ. 1లక్ష అందజేస్తామన్నారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల బాధ్యతలను ప్రభుత్వ శాఖలకు అప్పగిస్తామన్న మంత్రి పట్టణ ప్రాంతాల్లో మాత్రం కాంట్రాక్టు అప్పగిస్తామని చెప్పారు. నిజమైన లబ్ధిదారులను మాత్రమే ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేస్తామన్నారు.

### ఎంపిక విధానంపై స్పష్టత...

ఈ ప్రక్రియలో ఎవరి, ఎలాంటి సిఫారసులకు తావు ఇవ్వబోమన్నారు. మొదట పేదవారికి ప్రాధాన్యత కల్పిస్తామన్న మంత్రి ఇండ్ల స్థలం ఉండి ఉన్న వారికి రూ. 5లక్షల నిర్మాణ ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఇండ్ల స్థలాలు లేని నిరు పేదలకు 75 నుంచి 80 గజాల స్థలం ప్రభుత్వం ఇవ్వాలని ఆలోచన చేస్తోందన్న ఆయన 4వేల చ.అడుగులకు తక్కువ కాకుండా ఇండ్ల నిర్మాణం చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆధార్ కార్డు తప్పని సరి అని మంత్రి స్పష్టం చేశారు. మరోవైపు త్వరలోనే రేషన్ కార్డుల స్థానాల్లో స్మార్ట్ కార్డ్ ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పర్యవేక్షణకు ప్రభుత్వంలోని 16 శాఖలకు సంబంధించిన ఉద్యోగులను కేటాయిస్తామని వివరించారు. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇండ్ల నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అయితే ఇందిరమ్మ పథకంపై నాలుగు రాష్ట్రాల్లో అధ్యయనం చేసినట్లు మంత్రి తెలిపారు.

### రేవంతే పూర్తి కాలం సీఎం..

రాబోయే నాలుగేళ్ల ఒక నెల కూడా రేవంత్ రెడ్డే ఈ రాష్ట్రానికి సీఎంగా కొనసాగుతారని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఆ తర్వాత జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అనేది ఏఐసీసీ నిర్ణయిస్తుందన్నారు. అయితే సీఎం మార్పుపై ప్రతిపక్షాలు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. రేవంత్ మార్పుపై ప్రతిపక్షాల ఆరోపణలు టీ కప్పులో తుఫాన్ లాంటివే అన్నారు.

# అంత తేలికా..?

**(మొదటిపేజీ తరువాయి)** ప్రత్యేకంగానే భావిస్తుంటారు నేతలు. అందులో భాగంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆర్థికంగా ఇబ్బందిలేకుండా ఉండే హామీలనే ఇవ్వాలనే ఓ సూచన చేశారు. దీంతో ఇంచుమించు ఆచరణ సాధ్యం కానివి వద్దని, ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉన్నదనే అర్థం లో ఆయన తన మాటలను కొనసాగించారు. దీంతో ఆ మాటల వెనకున్న అసలు మర్మం ఏంటో పీఎం మోదీ తనదైన స్టైల్ లో ఎక్స్ వేదికగా వివరించారు.

### ప్రజల దృష్టిలో పల్చనకాకుండా..

నిజానికి మల్లికార్జున ఖర్గే మాటలు ప్రజాస్వామ్యానికి బ లం చేకూర్చేవిగా భావించాల్సి ఉంటుంది. ప్రజలను మోసం చేయకుండా, చేస్తామన్ని చేసేంత సత్తా ఉండేలా మనకు మనం జాగ్రత్త పడాలని ఆయన స్పష్టంగా చెప్పా రు. ఎన్నికల వేళ నోటికొచ్చింది వాగుతు, ఏదిపడి తే అది హామీలు గుప్పిస్తూ, ఎముకలేని నేతలుగా ఫో జులు కొట్టి గెలిచిన తర్వాత వాటిని తీర్చడానికి ఆస్తులు పోగేయలేక, అంతకు ముందున్న ప్రభుత్వాలు చేసిన అప్పులను పూడ్చలేక జనం దృష్టిలో పలుచనై పార్టీ ప రువు తీయొద్దనే ధోరణిలో ఆయన తన వ్యాఖ్యలు చేశారు. అధికారమే పరమావధిగా, ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యం గా పార్టీలు చేస్తున్న వికృత క్రీడలో ప్రజలు అన్ని సం దర్భాల్లో పావులు అవుతారనుకోవడం మూర్ఖత్వమే తప్ప మరోటి కాదు, తప్పకుండా ఇచ్చిన హామీల నెరవేర్చడంపైనే భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు.

### ఖర్గే వ్యాఖ్యలకు సైటైర్ గా పీఎం..

మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను పీఎం చాలా సైటైర్ గా వి వరించారు. కాంగ్రెస్ కు హామీల అమలు అంత తేలికేం కాదనే విషయం అర్థమైందని పేర్కొన్నారు. వాగ్దానాలు చేయడం సులభమేగానీ, వాటిని అమలు చేయడం చా లా కష్టమైన పని అని కాంగ్రెస్ గ్రహిస్తోందని తెలిపారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ఇప్పుడు జనం ముందు ఘోరంగా విఫలమై నిలబడ్డారని విమర్శించా రు. తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ లలో పాల న మొత్తంగా కుంటుపడిందని వివరించారు. ఆఖరులో ఫేక్ ప్రామిసెస్ ఆఫ్ కాంగ్రెస్ అని తనదైన విధానంతో ప్రధాని ట్వీట్ చేశారు. ఇలా వ్యాఖ్యలు చేయడంపై సహజంగానే తెలంగాణ సీఎం రేవంత్ కు ఎక్కడో మండి తనదైన విధంగా వివరణ ఇచ్చారు.

### బీజేపీకన్నా బెటర్..

బీజేపీ పాలన కన్నా తెలంగాణలో తమ పాలన అద్భుతంగా ఉందని, తమను ఒకరు వేలెత్తి చూపాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఎంకు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన బొందలు పూడ్చుకుంటూ, పాలనను గాడిలో పెట్టే పనిలో తల మునకలై ఉన్నామని తమ పాలనపై మరకలు అంటించాలని చూడడం సరికాదని ఘాటుగానే విమర్శించారు. తాము పగ్గాలు చేపట్టి కేవలం పదినెలలు కూడా కాలేదని, అప్పుడే ఎలా డిసైడ్ చేస్తారని ప్రశ్నించారు. ఇలా ఒకరికి ఒకరుగా కౌంటర్లు ఇచ్చుకుంటూ రాజకీయాలను హాట్ హాట్ గా మార్చారు.

## 10 వేల రోజులిచ్చినా సరిపోవు

**ఆరు గ్యారంటీలు అమలు చేయలేరు**

**సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ కౌంటర్**



**జనపదం, హైదరాబాద్ సిటీ:** అమలుకు సాధ్యం కాని, అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే పది వేల రోజులు కూడా సరిపోవని కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సెటైర్లు వేశారు. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన కౌంటర్ కు రీ కౌంటర్ ఇచ్చిన బండి సంజయ్ కేంద్రంలోని తమ బీజేపీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మిస్తుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూలుస్తుందన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఆలయాలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయనీ, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని ప్రభుత్వంపై మండిపడ్డారు.

## ప్రైవేట్ బస్సును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

**30 మందికి గాయాలు ,నలుగురి పరిస్థితి విషమం**

**స్పాట్ వాయిస్, కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. కోదాడలోని కట్టకొమ్ముగూడెం వద్ద ఆగి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును శనివారం తెల్లవారు జామున 3:30 ప్రాంతంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో 30 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళు తున్న ప్రైవేట్ ట్రావెల్స్ (మహి ట్రావెల్స్) స్లీపర్ బస్సు ప్రయాణికుల మూత్ర విసర్జన కోసం పక్కకు ఆపగా అదే సమయంలో టీజీ ఆర్టీసీ బస్సు ప్రైవేట్ ట్రావెల్స్ బ స్సును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టటంతో , ప్రయివే ట్ ట్రావెల్స్ లో వెనుక కూర్చున్న ప్రయాణికుల కు, ఆర్టీ సీ బస్సులో ముందు కూర్చున్న ప్రయాణికులకు గాయాలయ్యాయి.

# పారదర్శకంగా సమగ్ర సర్వే..

- ఇంటింటి సర్వేలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలి..
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- హాజరైన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు




**జనపదం, కరీంనగర్ :** కర్ణాటక లో చేపట్టిన సర్వే వివరాలు 10 సంవత్సరాలు గడిచిన బయట పెట్టలేదని , తెలంగాణలో మాత్రం పారదర్శకంగా సర్వే చేపడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనే విజయవంతం చేయాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. శుక్రవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషనర్ బాల మాయ దేవితో కలిసి కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సమగ్ర కులాల స్థితిగతులపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ఉదయం గెస్ట్ హౌస్ లో బీసీ కమిషన్ చైర్ పర్సన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 53 మంది వివిధ సంఘాల ప్రతినిధులు సమగ్ర కులాల స్థితిగతులపై తమ అభిప్రాయాన్ని తెలియజేసి నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్లు ఆరు సెట్లు సమర్పించారు. అభిప్రాయాల సేకరణ కార్యక్రమం అనంతరం బీసి కమిషన్ చైర్మన్ నిరంజన్ పాత్రికేయులతో మాట్లాడారు.. బృహత్తరమైన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, సమగ్రంగా అన్ని కులాల వారు ఎంతమంది, ఏ స్థితిగతులలో ఉన్నారో తెలుసుకుంటుందని అన్నారు. బీసీలకే పరిమితం కాకుండా ఓసీలు, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, సంచార జాతుల ఆర్థిక సామాజిక పరిస్థితి తెలుసుకునే ప్రయత్నం చేపట్టామని అన్నారు. బీసీ కమిషన్ ఎవరి ఒత్తిడులకు గురి కాకుండా ఉన్నది ఉన్నట్లు నివేదిక రూపొందించి సమర్పిస్తుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అభిప్రాయాలు తెలియజేసిన వారు క్షేత్రస్థాయిలో జరిగే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొని ఎన్యుమరేటర్లకు వివరాలు తెలియజేయాలని అన్నారు. జనాభాలో ఆయా వర్గాల జనాభా శాతం నిర్ధారించే బాధ్యత వారి పైనే ఉంటుందని, త్వరలో ప్రారంభమయ్యే ఇంటింటి సర్వే లో ప్రజలు పాల్గొని వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఈ విషయాన్ని ఏ కుల సంఘం విస్మరించరాదని అన్నారు. రాజకీయ పార్టీల విధి విధానాలు వేరైనప్పటికీ ఈ కార్యక్రమంలో ఆటంకాలు,అపోహలు సృష్టించే ప్రయత్నం చేయవద్దని అన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమై దీనిపై చర్చించిన సమయంలో అడ్వకేట్ జనరల్ సైతం పాల్గొన్నారని, ప్రస్తుతం తాము ఒక పార్టీకి చెందిన వారంకాదన్నారు. కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని, న్యాయ నిపుణుల సలహాల మేరకు బీసీ కమిషన్ కార్యక్రమాలు యాథా విధిగా కొనసాగు తాయని అన్నారు. ఉదయం నుంచి అనేక మంది ప్రతినిధులు వారి విజ్ఞప్తి తెలియజేశారని, కులాల స్థితిగతుల గురించి కమిషన్ దృష్టికి తీసుకుని వచ్చారని అన్నారు. బీసీ కమిషన్ ఆహ్వానం మేరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాలుగు జిల్లాల కలెక్టర్లకు కమిషన్ కృతజ్ఞతలుతెలిపారు. ప్రజల గోడు కలెక్టర్లు నేరుగా తెలుసుకోవడం మంచిదని, సమాజంలో ఉన్న అనేక కులాల గురించి మనకు తెలియదని, ఇటువంటి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అన్నారు. బీసీ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ ప్రజా ప్రతినిధులు రవీందర్ సింగ్, చెల్లా స్వరూప, పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతిక మొదలగు ప్రజా ప్రతినిధులు గెస్ట్ హౌస్ కు వచ్చి తమను కలిసి అభిప్రాయాలు తెలియజేశారని అన్నారు. బీసీ కుల గణన తెరమీదకి వచ్చిన తరువాత బీసీ కులాలే కాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓసీలలోని అన్ని కులాలకు సంబంధించి లెక్కలు తేలాలని సర్వే జరుగుతుందని, అందులో భాగంగా బీసీ కమిషన్ సంబంధించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ గురించి వచ్చినప్పటికీ ప్రజల స్థితిగతుల గురించి అందించిన అభిప్రాయాలను నోట్ చేసుకోవడం జరిగిందని అన్నారు. కులాలకు సంబంధించిన జనాభా, జీవన స్థితిగతుల వివరాలను రాబోయే 3,4 రోజులలో ప్రారంభమయ్యే కులాల సర్వేలో స్పష్టంగా అందజేయాలని సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలు, డిమాండ్స్ నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో జరిగే సర్వేలో క్రియాశీలకంగా పాల్గొనాలని, ఎన్యుమరేటర్లకు సహకరించి సమగ్ర సమాచారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మెట్రో రెండో దశకు గ్రీన్ సిగ్నల్..

- కొత్తగా 5 మార్గాల్లో హైదరాబాద్ మెట్రో..
- 76.4 కిలోమీటర్ల మేర నిర్మాణానికి చర్యలు
- పరిపాలనా అనుమతులు మంజూరు

**జనపదం, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగర వాసులు ఎదురుచూస్తున్న మెట్రో రెండో దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి సర్కారు పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 196ని జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,313 కోట్లను వెచ్చించనుంది. ప్రస్తుతం నగరంలో కొత్తగా 5 మార్గాల్లో మెట్రో రెండో దశ పనులు చేపట్టనున్నారు. కారిడార్ 4లో నాగోలు- శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్లు, కారిడార్ 5లో రాయదుర్గ-కోకాపేట వరకు 11.6 కిలో మీటర్లు, కారిడార్ 6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రయాణగుట్ట వరకు 7.5 కిలో మీటర్లు, కారిడార్ 7లో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4 కిలో మీటర్లు, కారిడార్ 8లో ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు 7.1 కిలో మీటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**మొత్తం 116.4 కిలోమీటర్లు..**

రెండో దశలో మొత్తం 116.4 కిలోమీటర్లు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే అందులో మొదటగా పార్ట్ ఏ కింద 76.4 కిలోమీటర్ల మార్గానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశామని, పార్ట్ -బిలో నిర్మించనున్న శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలో మీటర్ల మార్గానికి సర్వే జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. ఇక హైదరాబాద్ మెట్రో ద్వారా ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మెట్రో రైల్ రెండో దశలో పార్ట్-ఏ కు సంబంధించిన ఐదు కారిడార్లు ఇలా ఉన్నాయి. కారిడార్-4లో నాగోలు-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ (36.8 కి.మీ)., కారిడార్-5లో రాయదుర్గం-కోకాపేట్ (11.6 కి.మీ), కారిడార్-6లో ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ)., కారిడార్-7లో మియాపూర్-పటాన్ చెరు (13.4 కి.మీ)., కారిడార్-8లో ఎల్బీనగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ)., మెట్రో రైల్ రెండో దశలో పార్ట్-బీగా 40 కి.మీ. కారిడార్ 9లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ..



## అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలి...

- నర్సింగ్ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి
- తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- అధికారులతో సమీక్ష

**జనపదం, హైదరాబాద్ :** నర్సింగ్ కళాశాలలో ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆదేశించారు. శనివారం హైదరాబాదులోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలోని సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి, క్లాసులు ప్రారంభించిన మెడికల్ కళాశాలలకు అనుబంధంగా 15 నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను తక్షణం సమకూర్చాలన్నారు. రాష్ట్రంలో 15 నర్సింగ్ కళాశాలలైన జనగామ, భూపాలపల్లి, కరీంనగర్, కొడంగల్, ఆందోల్, ఆసిఫాబాద్, మెదక్, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట, నిర్మల్, రామగుండం, మహేశ్వరం, నర్సంపేట, యాదాద్రి లో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయడంతోపాటు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. అలాగే నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే తరగతులను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.



## 5న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్..

- గాంధీ ఐడియాలజీ సెంటర్ లో కులగణన సదస్సుకు హాజరు
- ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకెళ్తున్నది
- సీఎం మార్పుపై ఏలేటి వ్యాఖ్యలు అర్ధరాహిత్యం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**జనపదం, హైదరాబాద్ బ్యూరో :** ఈ నెల 5న సాయంత్రం నాలుగు గంటలకు బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ లో పీసీసీ ఆధ్వర్యంలో కులగణన పై జరగనున్న సలహాల సేకరణ కార్యక్రమంలో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. శనివారం ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన కులగణన కనెక్టింగ్ సెంటర్ ను ప్రారంభించిన ఆయన తర్వాత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించనున్న కులగణన తో పాటు అభివృద్ధి,సంక్షేమం పథకాలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కనెక్టింగ్ సెంటర్ ఉపయోగ పడుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఏ నిష్పత్తిలో జనాభా ఉంటే ఆ నిష్పత్తి ప్రకారం సంపద పంపిణీ జరగాలన్న పార్టీ చీఫ్.. తాము చేపట్టే కార్యక్రమంపై మేధావులు,విద్యార్థి నాయకులు,కుల సంఘాల నాయకులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు.ఈ నెల 5న జరగనున్న కార్యక్రమంలో కుల సర్వే పై అందరి సూచనలు,సలహాలు స్వీకరిస్తామన్నారు. వారు సూచనలు పరిగణలోకి తీసుకుని ముందుకువెళ్తామన్నారు. అలాగే దేశంలోనూ కులగణన జరగాల్సిన అవసరం ఉందన్న మహేశ్ కుమార్ గౌడ్.. కేంద్రం ఆ మేరకు త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే లో ప్రతి కార్యకర్త కుటుంబ భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శనివారం అన్ని జిల్లాల డీసీసీ కార్యాలయాల్లో కులగణనపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వివరించారు. కులగణనపై పీసీసీ తరుపున అన్ని పార్టీలను పిలిచి ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించి అందరి సలహాలు తీసుకుంటామన్నారు. కులగణన నిష్పక్షపాతంగా.. సజావుగా, ఎలాంటి అవాంతరాలు రాకుండా జరగాలన్నదే తమ అభిమతమన్నారు. మాజీ సీఎం కేసిఆర్ కి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే.. సమగ్ర కుటుంబ సర్వే రిపోర్ట్ ఎందుకు బయటపెట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీజేపీలో ఏలేటీకి గౌరవం లేదు**

సీఎం మార్పు విషయంలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. ఏలేటీ అర్ధరాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకువెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అందరి సలహాలు, సూచనలు తీసుకుని పాలన కొనసాగిస్తున్నారన్నారు. సొంత పార్టీలోనే ఏలేటీకి గౌరవం కరువైందనీ.. అసలు ఆయనకే కుర్చీలేదన్నారు. కాంగ్రెస్ లో ఉన్న ప్రజాస్వామ్యం..స్వేచ్ఛ మరెతర పార్టీలో లేదన్నారు. ఎన్నికల ముందు ప్రధాని మోదీ ఇస్తానన్న సంక్షేమ పథకాలు ఎన్ని వాటిలో ఎన్ని అమలయ్యాయో సమాధానం చెప్పాలన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ తన హామీని నెరవేర్చడంలో వైఫల్యం చెందారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పాడి కౌశిక్ రెడ్డి..నోరు జాగ్రత్త..

- అనిల్ కుమార్, బల్మూరు వెంకట్ ను విమర్శించే స్థాయి నీకు లేదు
- టీపీసీసీ రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి రవీంద్రనాథ్ నాయుడు



**జనపదం, హైదరాబాద్ సిటీ :** ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ను, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ను విమర్శించే నైతిక అర్హత హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి లేదని టీపీసీసీ రాష్ట్ర కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్ నాయుడు అన్నారు. జన్వాడ ఫామ్ హౌస్ రేవు పార్టీ కేసును గృహప్రవేశ పార్టీ అని మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి కౌశిక్ రెడ్డికి నేర చరిత్ర ఉందని, అందుకే గవర్నర్ కోటాలో ఆయన ఎమ్మెల్సీ పదవిని గత గవర్నర్ తిప్పికొట్టిందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించకపోతే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ప్రజల్ని బెదిరించి ఓట్లు వేయించుకొని గెలిచిన చరిత్రను ఆయనదన్నారు. సీఆర్, కేటీఆర్ మెప్పు కోసం కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డీహెచ్ ఉమేష్, సి.రఘునందన్ రావు, నాయకులు సత్యానారాయణ పి.సత్యనారాయణ, జానకి శ్రీనివాస్, వహీద్ హుస్సేన్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు



## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభం

**జనపదం, కోరుట్ల :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని, రైతును రాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో కథలపూర్ మండల కేంద్రంలో, భూషణ్ రావు పేట, సిరికొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పజెప్పడం జరిగిందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు ఉచిత విద్యుత్ పంపిణీ ఫైల్ పై తొలి సంతకం చేయడాన్ని గుర్తు చేసారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చేపడుతామని అన్నారు. 17 శాతం తేమ వచ్చాక ధాన్యం తూకం వేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతు భరోసా త్వరలోనే ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన చేశారని గుర్తు చేశారు. రుణమాఫీ లో భాగంగా సుమారు రూ.18 వేల కోట్లను 22 లక్షల మంది ఖాతాల్లోకి జమ చేశామని తెలిపారు. సాంకేతిక సమస్య వల్ల కొందరు రైతుల ఖాతాల్లో జమ కాలేదని, అవి జమ చేయడానికి వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆనాడు రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు శ్రమించేవాడని, అదే స్పూర్తితో ప్రస్తుతం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అలాగే కథలాపూర్ మండల కేంద్రంలో 220 కేవీ సబ్ స్టేషన్, సిరికొండ గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు అయ్యిందని పేర్కొన్నారు.



## సాగర్ టు శ్రీశైలం

**ప్రారంభమైన లాంచీ**

- ప్రయాణికుల కోసం టూర్ ప్యాకేజీలు
- కృష్ణానదిలో జలవిహారానికి సర్కార్ మరో ముందడుగు

**జనపదం, నల్గొండ :** ఎట్టకేలకు కృష్ణా నదిలో జల విహారానికి తెలంగాణ సర్కార్ శ్రీకారం చుట్టింది. శనివారం నుంచి నల్గొండ జిల్లా నార్జునసాగర్ నుంచి శ్రీశైలం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ టూ శ్రీశైలం లాంచ్ ప్రయాణం ప్రారంభమైంది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రయాణికుల కోసం టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. కార్తీక మాసం తొలి రోజును పురస్కరించుకొని అధికారులు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. నిజానికి గడిచిన కొన్నేళ్ల నుంచి ఈ బోటును నడిపించేందుకు ప్రణాళికలు వేశారు. అయితే కరోనా, ఆ తర్వాత సరైన వర్షాలు లేని కారణంగా బోటు ప్రయాణం వీలుపడలేదు. అయితే తాజాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీరు అందుబాటులో ఉండడంతో బోటు ప్రయాణాన్ని ప్రారంభించింది. ప్యాకేజీ ధర విషయానికొస్తే.. బోటు ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా నిర్ణయించారు. పూర్తి వివరాలు, బుకింగ్ కోసం తెలంగాణ టూరిజం అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని అధికారులు తెలిపారు. అయితే.. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. నేరుగా హైదరాబాద్ నుంచి కూడా టూర్ ఆపరేట్ చేస్తున్నారు.

## పగలు.. పంతాలతో సాధించిందేంటి?

- కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం..
- గత పాలనలో ప్రొటోకాల్ పాటించలే..
- మోదీ హయాంలో రాష్ట్రానికి అత్యధిక సీఆర్ఐఎఫ్ నిధులు
- గడ్కరీకి ప్రత్యేక కృతజ్ఞతలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- మల్యాల నుంచి కాచారం వరకు రూ.25 కోట్లతో డబుల్ లేన్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



**జనపదం, కరీంనగర్ :** 'పగలు, పంతాలు, రా జకీయ కక్షలతో సాధించేదేమీ లేదు. కార్యకర్తలు కొట్టుకోవడం, గొడవలు పడటం తప్ప. ఎన్నికల వరకే రాజకీయాలు. ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి చేసుకుందాం. ప్రజల ఆకాంక్షలను నెరవేరుద్దాం'...అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నడూ ప్రొటోకాల్ పాటించలేదని, కేంద్రం మంజూరు చేసిన నిధులను కూడా దారి మళ్లించిందని మండిపడ్డారు. కమీషన్లు, పేరు ప్రఖ్యాతలకే ప్రాధాన్యమిచ్చిందే తప్ప నిబంధనల ప్రకారం పనిచేయలేదని, అధికారులను కూడా పనిచేసుకోనివ్వలేదని అన్నారు.

శనివారం ఉదయం చొప్పదండి నియోజకవర్గం పరిధి మల్యాల మండల కేంద్రానికి విచ్చేసిన బండి సంజయ్ స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి రూ.25 కోట్ల వ్యయంతో మల్యాల చౌరస్తా నుంచి కాచారం వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా నేతలతో కలిసి భూమి పూజ చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమాన్ని పూర్తి చేయడాన్ని గమనించిన బండి సంజయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజుల తరువాత ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ను పా టించడం కన్పించిందని, ఇది మంచి వాతావరణమని, అధికారులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రొటోకాల్ పాటించలేదని, నిబంధనలను ఉల్లంఘించిందని, నిబంధనలు పాటించలేదని, అధికారులను కూడా పని చే యకుండా ఒత్తిడి తెచ్చిందన్నారు. పేరు ప్రఖ్యాతులకే బీఆర్ఎస్ ప్రాధాన్యతనిస్తూ కమీషన్లు దండుకుందని, ముఖ్యంగా గతంలో కేంద్రం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించిందన్నారు.

**ఎన్నికల వరకే రాజకీయాలు..**

నియోజక వర్గ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాలన్నదే మా అభిమతమని, ఈసారి కేంద్రం ఇచ్చిన నిధులను సద్వినియోగమయ్యేలా రూ.25 కోట్ల నిధులను మల్యాల నుండి కాచారం వరకు డబుల్ లేన్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని బండి సంజయ్ అన్నారు. రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ కి, నితిన్ గడ్కారీ కి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి గడ్కరీ అత్యధిక నిధులు మంజూరు చేశారని, తెలంగాణ రాష్ట్రానికి అత్యధికంగా సీఆర్ఐఎఫ్ నిధులు కేటాయించారని, మోదీకి, గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నాన్నారు. గొడవలు పక్కనపెట్టి రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఈ రోడ్డు విస్తరణ పనుల విషయంలో సహకరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బండి అభినందనలు చెప్పారు.

## ధాన్యం కొనకపోతే ధర్నా చేస్తాం..

**బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మ హెచ్చరిక**



**జనపదం, మెదక్ :** కొబ్బరికాయలు కొడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కాదు వెంటనే ధాన్యం తూకం ప్రారంభించకపోతే రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఆమె మాట్లాడుతూ సోమవారం నుండి కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తూకం చేయకపోతే అన్నదాతల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతా మని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి రైతులు ఓట్లేస్తే ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతులకు చుక్కలు చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. సన్న రకానికి రూ. 500 బోనస్ ఇవ్వడం దేవుడెరుగు, అసలు ధాన్యమే కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

# 6 నుంచి ఒంటిపూట బడులు

- ప్రాథమిక పాఠశాలలకు మాత్రమే వర్తింపు..
- అయినా.., మధ్యాహ్న భోజనం మాత్రం పెట్టాల్సిందే..
- హైస్కూళ్లకు పనివేళలు యథాతథం..
- అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా కుల గణన ప్రారంభం
- రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు..

జనపదం, హైదరాబాద్ బ్యూరో : తెలంగాణలో ప్రాథమిక విద్యాశాఖలన్నీ ఈ నెల 6వ తేదీ నుంచి ఒంటిపూట మాత్రమే పనిచేయనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే పాఠశాలలు ఉంటాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఆయా స్కూళ్ల టీచర్లు మూడు వారాలపాటు కుల గణనలో పాల్గొంటారని, అందుకే ప్రాథమిక పాఠశాలలు మధ్యాహ్నం వరకే పనిచే స్తాయని పేర్కొంది. పాఠశాలలు ఒంటి గంట వరకే పనిచేసినా షెడ్యూల్ ప్రకారం యథావిధిగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాల్సిందేనని ఆదేశించింది.

**ఉపాధ్యాయుల సేవలు..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 36,559 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 3,414 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సేవలను కుల గణనకు వినియోగించుకుంటున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అలాగే, 6,256 మంది ఎమ్మార్సీ సిబ్బంది, టైపిస్ట్ రికార్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో ప్రభుత్వ, ఎంపీపీ, జడ్పీపీ, ఎయిడెడ్ స్కూళ్ల నుంచి దాదాపు 2 వేల మంది మినిస్టీరియల్ సిబ్బందిని సర్వేకు వినియోగించుకుంటున్నట్టు వివరించింది.

**సెలవు దినాల్లో...**

స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ నుంచి 50 వేల మంది ఉద్యోగులు, అకౌంటెంట్, ఏఎన్ఎం, పీఈటీ వంటి కేసీబీవీ, యూఆర్ఎస్ నుంచి బోధనేతర సిబ్బంది సహా ఇంటింటి సర్వేలో పాల్గొంటారని చెప్పింది. ప్రణాళిక విభాగం ఆదేశాలకు అనుగుణంగా ఎస్జీటీ, పీఎస్‌హెచ్ఎంలు సెలవు దినాల్లో రోజంతా ఎన్యుమరేటర్ విధుల్లో పాల్గొనాలని ఆదేశించింది.





# అన్నీ అబద్ధాలే..

- హామీల అమలులో రేవంత్ చెప్పేవన్నీ అవాస్తవాలే...
- రాష్ట్రంతో పాటు దేశ ప్రజలను మోసం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం 1.61 లక్షల పోస్టులు భర్తీ చేసింది
- నియామకాలపై తప్పుడు ప్రచారం దురదృష్టకరం
- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు..

జనపదం, హైదరాబాద్ బ్యూరో : హామీల అమలు విషయంలో రాష్ట్రంతో పాటు, దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమె త్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 1,61,000 పోస్టులను భర్తీ చేసిందన్నారు. నియా మకాలపై రేవంత్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పైగా 50వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు రేవంత్ డబ్బా కొట్టు కొడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పే 50 వేల ఉద్యోగాలు గత ప్రభుత్వంలోనే నోటిఫై చేసినవే నన్నారు. వాటికి పరీక్షలు నిర్వహించి, సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసినవే కాదా..? అని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్న నియామక పత్రాలు ఇచ్చి, అవన్నీ తామే చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని మండి పడ్డారు. పైగా అన్ని అబద్ధాలు చెబుతూ రేవంత్ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందని శనివారం ఎక్స్



వేదికా ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగా లను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని కానీ ఈ రోజుకి 10 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. అలాగే గత సంవత్సరం డిసెంబరు 9వ తేదీకి రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా, అర్హులైన రైతుల్లో సగానికి పైగా ఇంకా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రతి నెలా రూ.4,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినా, 11 నెలల తర్వాత కూడా అమలు చేయలేదన్నారు. 18 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదన్నారు. ప్రతి విద్యార్థికి రూ. 5 లక్షలతో విద్యా భరోసా కార్డు ఇస్తామన్న హామీ ఇంకా ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, సన్న రకాలకు మాత్రమే పరిమితం చేశారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదా రులకు తులం బంగారం హామీ ఉసేలేదన్నారు. మహిళా విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహనాల హామీ ఇప్పటి వరకు రేవంత్ కు గుర్తు రాకపోవడం శోచ నీయమన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలు నెరవేరతాయని చెప్పారు. కానీ, ప్రభుత్వం వచ్చి 300 రోజులు గడిచినా హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. కొత్త హామీల సంగతి దేవుడెరుగు చివరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను అటకెక్కించిం దన్నారు.




# కుక్కలు కూడా దేఖయ్..

- పాక్కుంటూ వెళ్లినా పట్టించుకోరు..
- కేటీఆర్ ను నమ్మే పరిస్థితులు పోయాయ్..
- రాష్ట్రంలో పాలనను గతి తప్పేలా చేసిందే వాళ్లు..
- స్థానిక ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ రెడీ..
- ప్రత్యామ్నాయం కమలమే..
- నిజామాబాద్ ఎంపీ అరవింద్

జనపదం, జగిత్యాల : కేటీఆర్ పాకులాడుకుంట పాదయాత్ర చేసినా కుక్క కూడా ఓటు వేయదని, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని వీకేబీ ఫంక్షన్ హాల్ లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని, ఎన్నికలు ఎంత తొందరగా వస్తే బీజేపీకి అంత మంచిదన్నారు. రేవంత్ రెడ్డిని రైతులు, మహిళలు తిడుతున్నార న్నారు. రూ.500 బోనస్ పక్కన పెడితే కొనుగోలు కేంద్రాలు దిక్కులేదన్నారు. ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ రూ. లక్ష ఏవి అని, తులం బంగారం అంటిరి జనవరి పోయి మళ్లీ జనవరి వస్తుంది ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

**తొందర్లోనే చస్తది..**

కాంగ్రెస్ పార్టీ అనుకున్న దానికంటే త్వరగానే చని పోబోతుందని, పది నెలల్లో ఇంత దిగజారిపోయిం దంటే ఆ పార్టీ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. రేవంత్ ఎన్నికలు పెడతాడని నమ్మకం లేదని, తొందరగా బీసీ కులగణన సక్రమంగా కంప్లీట్ చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. కేసీఆర్ ఆయన కుటుంబం కోసం తప్ప ఏ కుటుంబ సర్వే చేయలేదని ఎలాంటి డేటా లేదని అన్నారు. 119 నియోజవర్గాల్లో బలమైన అభ్యర్థు లను తయారు చేసుకొని 100 సీట్లు సాధించే దిశగా ముందుకు వెళ్లాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనా రాయణ రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇన్చార్జి డా.బోగ శ్రావణి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిలా సత్యనారాయణ, యాదగిరి బాబు, జగిత్యాల జిల్లా సభ్యత్వ కన్వీనర్ డాక్టర్ రఘు, కన్నం అంజయ్య, ఇంచార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు..

**నిత్యం జనంలోనే ఉంటా**
**మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్**

జనపదం, ఉప్పల్ : ఐదు నెలలుగా ఏ సమస్య వచ్చినా, వక్ఫ్ బోర్డ్, హైడ్రా, మూసీ పరివాహక ప్రాంతాలలో తిరుగుతున్న, ఇల్లు కూలగొట్టడానికి వచ్చినా, దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములు జోలికి వచ్చినా అడ్డం నిలబడ్డామని, వారి సమస్యల మీద నిత్యం వెంట ఉంటూ స్పందిస్తూ వాళ్లకు విశ్వాసాన్ని, ధైర్యాన్ని కలిగిస్తున్నామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అందుకే నియోజక వర్గం ప్రజలు బీజేపీ క్రియాశీలక సభ్యత్వాలు తీసు కుంటున్నారని తెలిపారు. శనివారం ఉప్పల్ నియో జకవర్గం మల్లాపూర్ లో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిం చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలోనే అతి ఎక్కువ ఓటర్లు కలిగిన నియోజక వర్గం మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గమని, మల్కాజిగిరి ఒక మినీ ఇండియాగా మనం పిలు స్తుంటామన్నారు. 38 లక్షల ఓట్లు ఉన్న నియోజక వర్గంలో 52 శాతం ఓట్లు సాధించి భారతీయ జనతా పార్టీకి ఆజేయమైనా శక్తినిచ్చేదన్నారు. సభ్యత్వ నమోదు జరుగుతున్న సందర్భంలో బీజేపీకి వచ్చిన 10 లక్షల ఓట్లలో ఐదు లక్షల సభ్యత్వ నమోదు చేయమని ఆదేశం ఇస్తే ఇప్పటికే మూడు లక్షల పైచిలుకు సభ్యత్వం నమోదు చేసి రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మూడు జిల్లాల అధ్య క్షులతో సమావేశం నిర్వహించామని, పదో తారీకు లోపు సభ్యత్వాన్ని పూర్తిచేయాలని సూచించామ న్నారు. ఒక్కో బూత్ లో 100కు తగ్గకుండా సభ్యత్వాలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని, డిలి మిటేషన్ జరిగితే ఈ పార్లమెంట్లో అత్యధిక ఎమ్మెల్యే సీట్లు వచ్చే ఆస్కారం ఉంది కాబట్టి దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వమైన, రాష్ట్ర ప్రభుత్వమైన, జీహెచ్ఎంసీ అయిన ప్రజల సమస్యలపై సంకుచి తంగా కాకుండా కలిసికట్టుగా ముందుకు పోవాలని అధికారులు కూడా సంపూర్ణంగా సహక రించి తెలంగాణ రాష్ట్రానికి, మల్కాజిగిరి నియోజక వర్గ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావే శంలో మాజీ ఎమ్మెల్యే బీజేపీ ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, సత్యనారాయణ తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేమున్నామనే భరోసానివ్వాలి

**పిల్లల, మహిళల రక్షణకు చర్యలు తీసుకోవాలి**
**పోలీస్ కమిషనర్ అనురాధ**

జనపదం, సిద్దిపేట : పిల్లల, మహిళల రక్షణకు మేమున్నామని భరోసా కల్పించాలని సిద్దిపే ట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. శనివారం సిద్దిపేట కమిషనర్ కార్యాలయం పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కమిషనర్ మాట్లాడారు. షీ టీమ్, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి మహిళలకు పిల్లల రక్షణకు పెద్దపీట వేయాలని సూ చించారు. సహాయం కోరి వచ్చే మహిళలు పిల్లల పట్ల గోప్యత పాటించాలని, సంబంధిత ఏసీపీలు వారానికి ఒక రోజు షీ టీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మానిటర్ చేయాల న్నారు. మహిళలకు, ఆడపిల్లలకు షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చేలా విధులు నిర్వహించా లని,, స్కూల్స్, కాలేజీల్లో షీ టీమ్ ప్రోగ్రాం అయిపో యిన తర్వాత సంబంధిత టీచర్లతో పిల్లలతో కాసేపు సరదాగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాల న్నారు. టీచర్లు కూడా స్కూల్ కు వచ్చే అమ్మాయి లలో ఏమైనా ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే సంబంధిత షీటీమ్ సిబ్బందికి తెలియపర్చాలన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ , యూట్యూబ్ రీల్స్ తదితర సోషల్ మీడియాలను చూడకుండా తల్లిదం డ్రులు బాధ్యత వహించాలన్నారు. అమ్మాయిల విషయంలో ఏదైనా సంఘటన జరగకముందే సంఘటన జరగకుండా కౌన్సిలింగ్ చేయడం చాలా ముఖ్యమని తెలిపారు. అమ్మాయిల మైండ్ సెట్ మారే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. యుక్త వయసులో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తును అందాకారం లోకి నెట్టేస్తాయి. షీటీమ్ భరోసా సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు పోక్సో కేస్ స్టడీ లను తెలియపరచి అవగాహన క ల్పించాలని సూచించారు. ప్రతిరోజు స్కూల్లో, కాలేజీలు తదితర ప్రాంతాలలో మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి మహిళల భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హాట్ స్పాట్ పరిసర ప్రాంతాల్లో షీటీమ్ కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని మహిళా ఇన్స్పెక్టర్ దుర్గా కు సూచించారు. షీటీమ్ జిల్లా నెంబర్, షీటీమ్ సిబ్బంది నెంబర్లు కాలేజీలు స్కూల్ ల వద్ద పిల్లలకు కనబడేలా చిన్న చిన్న బోర్డ్స్ ఏర్పాటు





చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా కోమటి చెరువు, పాండవుల చెరువు, ఆక్సిజన్ పార్క్, రాజీవ్ పార్క్, అర్బన్ పార్క్ బస్టాండ్ల వద్ద, స్కూల్లో కాలేజీల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. భరోసా సెంటర్ సిబ్బంది కూడా తరచుగా షీటీమ్ కార్యక్రమంలో పాల్గొని మైన ర్ అమ్మాయిలకు అందిస్తున్న సేవలు గురించి వివరించాలని సూచించారు. ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. మైనర్ అబ్బాయిలు అమ్మాయిలు కనబడితే కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. కౌన్సిలింగ్ నిర్వహించే సమయంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం హాట్స్పాట్ వద్ద విసిబుల్ పోలింగ్ విధులు నిర్వహించాలని కమిష నర్ మేడం గారు సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, ఎస్ బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీసీ నితిన్ రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, మూడు డివిజన్ల షీటీమ్ సిబ్బంది, సిద్దిపేట భరోసా సెంటర్, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

# కార్తీకం.. ప్రత్యేకం..

- శైవక్షేత్రాలకు స్పెషల్ బస్సులు..
- అరుణాచలం, పంచా రామాలకు ప్యాకేజీలు
- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి
- పనితీరుపై ఉన్నత స్థాయి సమీక్ష

జనపదం, హైదరాబాద్ సిటీ: పవిత్ర కార్తీక మాసంలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. శ్రీశైలం, వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట తదితర దేవాలయాలకు హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులను నడుపుతున్నామని ఆయన చెప్పారు. ఆర్టీసీ పనితీరు, కార్తీకమాసం ఛాలెంజ్, శబరిమల ఆపరేషన్స్, మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు సౌకర్య పథకం తదితర అంశాలపై హైదరాబాద్ బస్ భవన్ నుంచి శనివారం వర్చువల్ గా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి కార్తీక మాసం, శబరిమల ఆపరేషన్స్ ఎంతో కీలకమన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆది, సోమవారాలు శైవక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తున్నామని తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ లోని పంచారామాలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. ఈ



ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవాలన్నారు. మరిన్నీ వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించారు.

**బస్ ఆన్ కాంట్రాక్ట్(బీవోసీ) చార్జీలు తగ్గింపు..**

అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సు చార్జీలను తగ్గించినట్లు సజ్జనర్ తెలిపారు. పల్లె వెలుగు కిలోమీటర్‌కు రూ.11, ఎక్స్ ప్రెస్ రూ.7, డీలక్స్ రూ.8, సూపర్ లగ్జరీ రూ.6, రాజధాని రూ.7 మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. శబరిమలకు, శుభము హూర్తాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులను బుకింగ్ చేసుకుని క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, హెచ్‌వోడీలు శ్రీదేవి, శ్రీధర్, వెంకన్న, సుధా పరిమళ, విజయభాస్కర్, శ్రీనివాసరావుతో పాటు ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.

# నోరు తెరిస్తే తట్టుకోలేరు..

**జాతకాలన్నీ విప్పాల్సి ఉంటుంది..**
**ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ**
**బీఆర్ఎస్ నేతలపై మండిపాటు..**

జనపదం, హైదరాబాద్ : 'నోరు తెరిస్తే నిజంగా తట్టుకోలేరు. మీ జాతకాలన్నీ నా చేతిలో ఉన్నాయి. ఎవరేంటో అంతా తెలుసు. అక్కరు న్నప్పుడు ఒకలా, తీరిన తర్వాత మరోలా ఉండడం మీకు బాగానే అనిపిస్తుందేమోగానీ, మేం అలా కాదు.., విలువలతో మసులు కుంటాం., రాజకీయంగా హుందాగా వ్యవహ రిస్తాం..'' అని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఘాటుగా విమ ర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల జాతకాలన్నీ తన వద్ద ఉన్నాయన్నారు. ఒక్కొక్కరి గురించి చెప్పడం మొదలు పెడితే ఎవ్వరూ తట్టుకోలేరన్నారు. బీఆర్ఎస్ రెండు పర్యాయాల పాలనలో మూసీ సుందరీకరణ పేరుతో చేసిందేమీ లేదన్నారు. కేవలం మాటల తోనే దాటవేస్తూ, పనులన్నీ అటకెక్కించిన చరిత్ర బీఆర్ఎస్ ది అన్నారు. ఎంఐఎం కాంగ్రెస్



జత కట్టాయని అడ్డమైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. భారత రాష్ట్ర సమితి గతంలో ఎంఐఎం మద్దతుతోనే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గెలిచిందనే విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తు చేసుకుంటే మంచిదన్నారు. రాజకీయంగా మాట్లాడాలి కాబట్టి ఏదిపడితే అది మాట్లాడితే సహించమ న్నారు. ఆ పార్టీలోని ప్రతి ఒక్కరి జాతకం నిక్షిప్తమై ఉందని, బయటపెట్టాల్సిన పరిస్థితిని తెచ్చుకోవద్దని హితువు పలికారు.




# సదర్‌తో దద్దరిల్లుతున్న నగరం..

- ప్రత్యేక ఆకర్షణగా దున్న రాజుల విన్యాసం..
- భారీగా తరలివచ్చిన జనం..

జనపదం, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నారాయణగూడలో సదర్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు దున్న రాజులపై ఎక్కి చేసిన నృత్యాలు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. విన్యాసాలు చూడడా నికి భారీగా ప్రజలు తరలిరావడంతో నారాయ ణగూడ పరిసరాలన్నీ సందడిగా మారాయి.

**గోలు-2, శ్రీకృష్ణ..**

హైదరాబాద్ సదర్ ఉత్సవాల్లో గోలు -2, శ్రీకృష్ణ దున్నరాజులు ప్రజలను కట్టిపడేస్తు న్నాయి. ప్రత్యేక వాహనంలో వాటిని



నారాయణ గూడ పెద్ద సదర్ కు భారీ ర్యాలీగా వాటిని తీసుకొచ్చారు. యాదవ సోదరులతో అలయ్, బలయ్ తీసుకున్నారు. డప్పు చప్పుళ్లు, దున్నరాజుల విన్యాసాలతో నగరం దద్దరిల్లు తుండగా, నారాయణ గూడలో ఉత్సవ సంబురాలు అంబరాన్నంటాయి.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com